క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా ఉంటాం



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శనివారం ఆమె నర్సాపూర్‌లోని తన నివాసంలో మండలంలోని గౌతాపూర్ గ్రామానికి చెందిన మన్నె కృష్ణవేణికి రూ. 2 లక్షల పార్టీ సభ్యత్వ బీమా చెక్కును అందజేశారు. కృష్ణవేణి భర్త మన్నె పండరి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయనకు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ బీమా ఉంది. దీంతో బాధిత కుటుంబానికి చెక్కు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విఠల్, భీమయ్య, మనోహర్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

దుర్గామాత ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా వెంకటేష్ గౌడ్



సమావేశమైన ఉత్సవ కమిటీ సభ్యులు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో దుర్గామాత ఉత్సవ కమిటీ 20వ వార్షికోత్సవం సందర్భంగా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఈ మేరకు దుర్గామాత ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షుడు మాసుల కరుణాకర్, కోశాధికారిగా జీడి చంద్రకాంత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మావురం రాజు (బొట్టు)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులు చీకోటి వెంకటేశం, చల్మేటి నాగరాజు, పప్పుల కిష్టారెడ్డి, పంజా శ్రీనివాస్, పప్పుల సిద్ధరాంరెడ్డి, చల్మేటి నరేందర్, బజార్ తిరుమల గౌడ్, బజార్ స్వామిగౌడ్, లచ్చపేట రామాగౌడ్, పన్యాల వెంకటరెడ్డి, జీపీ స్వామి, వెల్దుర్తి కొండల్ గౌడ్, నాయిని వెంకటేశం, తాడెం శ్రీరాములు ఎన్నికయ్యారు.

విద్యార్థులు సైన్స్‌లో రాణించాలి



విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీజన

హవేళిఘణాపూర్(మెదక్): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూ సైన్స్‌పై ఆసక్తి చూపి తమలో ఉన్న ప్రతిభకు పదును పెట్టాలని ఎంజేపీ బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీజన పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం హవేళిఘణాపూర్ పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల ఎగ్జిబిషన్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో నాగరాజు, అగస్త్య సభ్యులు శ్రీకాంత్, వెంకటేశ్, దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

పాపన్నపేట(మెదక్): కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగా లేఖ రాసినట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచినా ఫీజు బకాయిలను మాఫీ చేయలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.4500 కోట్ల ఫీజు బకాయిలు ఉన్నాయన్నారు. అవి చెల్లించక పోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు.

అంగన్‌వాడీలో వైద్యపరీక్షలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొత్తచెరువుతండా, లింగంపల్లి, వెంకటాపూర్(ఆర్) తదితర గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం వైద్యసిబ్బంది గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ఏఎన్ఎంలు రాజమణి, మజీదబేగం, లక్ష్మీ, రేణుక వైద్యచికిత్సలు చేశారు. అవసరం ఉన్న వారికి వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు మమత, శకుంతల, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

చాకరిమెట్లలో భక్తుల పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం పదిలం

మనోహరాబాద్(తూప్రాన్): పౌష్టికాహారంతోనే ఆరోగ్యం పదిలమని పీహెచ్‌సీ వైద్యులు వికాస్ అన్నారు. శనివారం మండల పరిధిలోని రామాయపల్లి గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ లక్ష్మీ నర్సింలుతో కలిసి ఆరోగ్య రక్షణ కోసం నిత్యం పౌష్టికాహారాన్ని, ఇంటి భోజనానికి ప్రాధాన్యత ఇస్తామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చిన్నారులకు ఇంజక్షన్‌లు వేశారు. అనంతరం అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేశ్, అంగన్‌వాడీ టీచర్ సునీత, శారద, వినోద, పద్మావతి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రతన్‌లాల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతను నివారించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): సంపూర్ణ ఆరోగ్యం కోసం పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖమర సుల్తాన తెలిపారు. శనివారం కౌడిపల్లి బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో పోషణ మాసోత్సవంలో భాగంగా విద్యార్థినులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతీ రోజు పోషకాహారం తినాలని చెప్పారు. రక్తహీనతను నివారించేందుకు పాలు, కోడిగుడ్లు, ఆకుకూరలు ఎక్కువగా తినాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు సాజిద్‌అలి, ఓంప్రకాష్, అంగన్‌వాడీ టీచర్లు కమల, సుమిత్ర, నిర్మల, రజియాసుల్తాన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): బాలికల ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు



మనోహరాబాద్(తూప్రాన్): రామాయపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, గ్రామస్తులు

ప్రైవేట్‌కు దీటుగా బోధిస్తాం



నర్సాపూర్ రూరల్: విద్యార్థినికి గుర్తింపుకార్డు ఇస్తున్న హెచ్‌ఎం కరుణ, తదితరులు



నిజాంపేట(మెదక్): రాంపూర్ పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్‌ఎం పద్మారెడ్డి

నర్సాపూర్ రూరల్: విద్యార్థుల తల్లిదండ్రులు సహకరిస్తే ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన అందిస్తామని మండలంలోని నాగులపల్లి (బంజారా నగర్)జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కరుణ అన్నారు. శనివారం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలో చెప్పిన హోంవర్క్‌తో పాటు పాఠాలను ఇంటివద్ద చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. గ్రామానికి చెందిన కార్పోల్ శివకుమార్, పీఎస్‌ఎస్ డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి, తాళ్ల శ్రీనివాస్‌లు విద్యార్థులకు వారి సొంత ఖర్చులతో ఐడెంటి కార్డులు, బెల్టులు, టై, షులు అందజేశారు.

ఇంటివద్ద హోమ్ వర్క్ చేయించాలి

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థుల బవిష్యత్ కోసం ఇంటి వద్ద రెండు గంటల పాటు తల్లిదండ్రులు హోమ్ వర్క్ చేయించాలని జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం దీప్లా రాథోడ్ సూచించారు. శనివారం జెడ్పీపాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విద్యార్థుల తల్లిదండ్రులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ విద్యార్థి తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం పద్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, శ్రీమతి సుకన్య, నరేష్, చంద్రకాంత్, కుమారస్వామి పాల్గొన్నారు.

పాఠశాలలో సమస్యలు పరిష్కరించండి



తూప్రాన్: మాట్లాడుతున్న హెచ్‌ఎం లక్ష్మణ్



కౌడిపల్లి(నర్సాపూర్): కంచన్‌పల్లి పాఠశాలలో..

కొల్చారం(నర్సాపూర్): పాఠశాలలో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని శనివారం మండలంలోని ఎనగండ్ల, రంగంపేట ఉన్నత పాఠశాలలో జరిగిన పోషకుల సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎనగండ్ల ఉన్నత పాఠశాలలో అరకుర వసతులతో విద్యార్థులు సమస్యలపై హెచ్‌ఎంలకు విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వెంకటరమణాచారి, ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలి: హెచ్‌ఎం

తూప్రాన్: పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం ఎశెందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కంచన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్ సమావేశం నిర్వహించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

జిల్లా వ్యాప్తంగా శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



శివ్వంపేటలో లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్ కో ఇన్‌చార్జి ఏఈ సాయికుమార్ తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల్లో భాగంగా చిన్నగొట్టిముక్ల, పెద్ద గొట్టిముక్ల, తిమ్మాపూర్, చెన్నాపూర్ గ్రామాలకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

తూప్రాన్‌లో..

తూప్రాన్: పట్టణంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ వరహాలరావు శనివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతరాజుపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

విద్యుత్ వైర్ల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామంలో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ వైర్లపై సాక్షి దినపత్రికలో శనివారం విద్యుత్ వైర్లను తొలగించండి అనే కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిత విద్యుత్ సిబ్బంది స్పందించి ప్రమాదభరితంగా ఉన్న వైర్లను తొలగించి సమస్యను పరిష్కరించారు.

వివాహిత అదృశ్యం



నాగమణి(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో వివాహిత అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లష్కరి నాగమణి ఈ నెల 18న ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు గ్రామ పరిసరాలతో పాటు, బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికిన ఆచూకీ లభించలేదు. నాగమణి భర్త నర్సింలు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని మండల నోడల్ అధికారి వెంకటేశం అన్నారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అనేక రకాల నిధులు కేటాయిస్తుందని, మధ్యాహ్న భోజనం, నోట్‌బుక్స్, ఉచిత విద్యను అందిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా పాఠశాలలకు పంపించాలని సూచించారు.

ప్లాస్టిక్ రహిత సమాజం రావాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అన్నారు. మండలంలోని పెద్దచింతకుంటలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం స్వచ్ఛతాహీ సేవలో భాగంగా నర్సాపూర్‌లోని అర్బన్ పార్కు ఆవరణలో ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. రోజు వారి వినియోగంలో ప్లాస్టిక్ లేకుండా చూడాలని కోరారు. కాగా విద్యార్థులు అర్బన్ పార్కు నుంచి రహదారి వెంట ప్లాస్టిక్‌ను ఏరి మున్సిపల్ సిబ్బందికి అప్పగించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ దామోదర్, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు, మేనేజర్ మధుసూదన్, ప్రోగ్రాం ఆఫీసర్ సురేష్‌కుమార్ లెక్చరర్లు శ్రీనివాస్, ఆరీఫ్, మహశ్రీధర్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలి



పాపన్నపేట జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే పార్టీలో విద్యార్థుల కోలాహలం

పాపన్నపేట(మెదక్): విద్యార్థులు లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని ప్రిన్సిపాల్ నర్సింలు అన్నారు. పాపన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డేలో ఆయన మాట్లాడారు. విద్యార్థి జీవితంలో ఇంటర్ కీలకమని చెప్పారు. ఈ సమయంలో గమ్యం ఏర్పాటు చేసుకొని, దాని సాధన కోసం నిరంతరం శ్రమించాలని కోరారు. ప్రతీ క్షణం విలువైనదే నన్నారు. 100 శాతం అటెండెన్స్ ఉండాలన్నారు. సెకండ్ ఇయర్ విద్యార్థులు, ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఇచ్చిన పార్టీలో ఆటలు, పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో లెక్చరర్లు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ పూర్తి చేయాలి



ప్లాట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు త్వరగా ధ్రువపత్రాలు సమర్పించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండల కేంద్రం కౌడిపల్లి, ధర్మాసాగర్ గ్రామాల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారుల ప్లాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల్లో 686 మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. దరఖాస్తు దారులు త్వరగా ప్లాట్లుకు సంబంధించి ధ్రువపత్రాలు సమర్పిస్తే ఎంపీడీఓ, తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా పరిశీలిస్తారని తెలిపారు. ఎల్ఆర్ఎస్ త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

చందాలతో నివాస గృహ నిర్మాణం



ఇంటిని ప్రారంభిస్తున్న నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో ఇటీవల వర్షాలతో నివాస గృహం కూలిపోయి నిరాశ్రయురాలైన మహిళకు గ్రామస్తులు చందాలు వేసి గృహాన్ని నిర్మించారు. ఈ మేరకు ఆ ఇంటిని శనివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన అయ్యవారి భాగ్యమ్మ దివ్యాంగురాలు, ఆమె ఇద్దరు కుమారులు కూడా దివ్యాంగులు కాగా భర్త మృతి చెందాడు. ఇటీవల కురిసిన వర్షంతో శిథిలమైన ఇల్లు కూలిపోయింది. అధికారులు ఆమెకు పాఠశాల గదిలో తాత్కాలిక వసతి కల్పించారు. దీంతో గ్రామ యువకులు ముందుకొచ్చి చందాలు పోగుచేసి ఇల్లు నిర్మించారు. ఈ ఇంటిని శనివారం మాజీ ఎంపీపీ అరుణ, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, నర్సింలుగౌడ్, బాలకృష్ణగౌడ్ ప్రారంభించారు.

అక్రమ బదిలీలు నిలిపేయాలి



పరిశ్రమ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సుగుణ ఫుడ్స్ ప్రైవేట్ పరిశ్రమలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు కార్మికుల అక్రమ బదిలీ ఉత్తర్వులు నిలిపేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. గుర్తింపు పొందిన యూనియన్‌తో చర్చలు జరపకుండా నిబంధనకు విరుద్ధంగా కార్మికులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడంపై తీవ్రంగా ఖండించారు. కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పరిశ్రమ యాజమాన్యంపై డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సంగారెడ్డిలో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పరిశ్రమ ఎదుట శనివారం వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు యాదగిరి, కుమార్, ఇంద్రేశ్, రమాకాంత్, భాస్కర్, పోచయ్య, తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనోత్సవం



శివ్వంపేట(నర్సాపూర్): వినాయకుడు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



నర్సాపూర్‌లోని మారుతినగర్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న మహిళలు

నర్సాపూర్: వినాయక నవరాత్రులను పురస్కరించుకొని పట్టణంలోని మారుతినగర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడికి కాలనీవాసులు మిఠాయిలతో నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గ్రామాల్లో వినాయకుల నిమజ్జనోత్సవం చేశారు. గోమారంలో నిర్వహించిన నిమజ్జనోత్సవంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

◆ **పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం**

అల్లాదుర్గం(మెదక్): పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పార్టీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బల్‌రాం అన్నారు. శనివారం అల్లాదుర్గం పట్టణంలో మహాలక్ష్మి పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శేషారెడ్డి, గ్రామ అధ్యక్షుడు సదానందం, మధు, బేతయ్య, నాగిశెట్టి, బాలకిషన్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

◆ **మోటార్ దొంగిలించిన వ్యక్తులకు దేహశుద్ధి**

శివ్వంపేట(నర్సాపూర్): మోటార్, పైపు, కెబుల్ వైరు చోరీకి పాల్పడిన వ్యక్తులకు గుర్తించిన గ్రామస్తులు గ్రామ పంచాయతీలో నిర్బంధించి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి కిషన్‌రావుకు చెందిన వ్యవసాయ పొలం నుంచి సింగిల్ ఫేస్ మోటార్, పైపు, కేబుల్ వైరు చోరీకి గురైంది. గ్రామానికి చెందిన స్వామి, శేఖర్, విక్రమ్ చోరీ చేసిన విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

◆ **బీజేవైఎం ప్రధాన కార్యదర్శిగా మదన్‌రెడ్డి**



టేక్మాల్(మెదక్): బీజేవైఎం మెదక్ జిల్లా కార్యదర్శిగా మండల పరిధిలోని చల్లపల్లి గ్రామానికి చెందిన మదన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాన్ని శనివారం అందించినట్లు చెప్పారు.

◆ **సూరారం పెద్ద చెరువు బుంగ పూడ్చివేత**

చిన్నశంకరంపేట(మెదక్):మండలంలోని సూరారం పెద్ద చెరువు తూము వద్ద ఏర్పడ్డ బుంగను అధికారుల చొరవతో పూడ్చారు. శనివారం పెద్ద చెరువుకట్టకు ఏర్పడ్డ బుంగ విషయం గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో తహసీల్దార్ మన్నన్, ఎస్ఐ నారాయణగౌడ్ బుంగను పరిశీలించారు. వెంటనే జేసీబీ సాయంతో కట్టకు ఏర్పడ్డ బుంగను పూడ్చివేయించారు.

◆ **పీఆర్‌టీయూ మండల కార్యవర్గం**

టేక్మాల్(మెదక్): పీఆర్‌టీయూ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టేక్మాల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో 2024 -26 సంవత్సరానికి పీఆర్‌టీయూ మండలాధ్యక్షులుగా ఎండీ అమిరుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్. సహదేవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారిగా అల్లాదుర్గ్ మండల శాఖ అధ్యక్షుడు జనార్ధన్, శంకరంపేట (ఆర్) మండలాధ్యక్షుడు హరిబాబు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, కృష్ణ సమక్షంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు.

◆ **పాపన్నపేటలో పిడుగు పాటు**

పాపన్నపేట (మెదక్): మండల పరిధిలోని పాతూర్‌లో శనివారం సాయంత్రం పిడుగు పడింది. రాముని పాదాల వద్ద వేపచెట్టుపై పిడుగు పడగ, కొమ్మ విరిగి కింద పడింది. ఏ నష్టం జరగలేదు.

◆ **విద్యను దెబ్బతీసే జీఓ25ను మార్చాలి**

చిన్నశంకరంపేట(మెదక్): ప్రాథమిక పాఠశాలల మనుగడను దెబ్బతీసేలా ఉన్న జీఓ 25ను వెంటనే మార్చాలని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలయ్య అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీఓ 25 ప్రకారం 60 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లతో సరిపెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థులకు అన్యాయం జరగనుందన్నారు. ప్రభుత్వం జీఓను వెంటనే వెనక్కు తీసుకొని, ప్రభుత్వ ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.

◆ **నీటి సమస్యకు చర్యలు తీసుకుంటాం**

నర్సాపూర్: పట్టణంలో కొందరు నల్లాలకు కరెంట్ మోటార్లు బిగించడంతో నీటి సమస్య తలెత్తిందని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని ఆరు, ఏడు వార్డుల్లో చాలా కాలంగా నల్లాల ద్వారా భగీరథ నీళ్లు రావడం లేదని ప్రజలు శుక్రవారం ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్ శనివారం పట్టణంలోని ఆరు, ఏడు వార్డుల్లో పర్యటించి భగీరథ నల్లాల పనితీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఇళ్లకు పైపులైన్ ఏర్పాటు చేసి నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించినట్లు తెలిపారు.

◆ **షార్ట్ సర్క్యూట్‌తో వస్తువులు దగ్ధం**

చేగుంట(తూప్రాన్): షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో వస్తువులు దగ్ధమైన సంఘటన మండలంలోని బీకొండాపూర్‌లో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం .. డబుల్‌బెడ్రూంలో నివాసం ఉంటున్న రవి ఇంట్లో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇంటి సామగ్రి కాలిపోయింది. వంటసామగ్రి, దుస్తులు, ఫర్నిచర్ మంటల్లో దగ్ధమై దాదాపు 50 వేల నష్టం జరిగిందని రెవెన్యూ అధికారులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌యాదవ్ పంచనామా నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించనున్నట్లు పేర్కొన్నారు.

◆ **కోడి పిల్లల అందజేత**

చేగుంట(తూప్రాన్): మహిళా సంఘం ఆధ్వర్యంలో జెత్రం తండాలో ఏర్పాటు చేసిన నాటుకోళ్ల మదర్ బర్డ్ యూనిట్ నుంచి మూడు గ్రామాలకు శనివారం కోడి పిల్లలను అందజేశారు. ఈ సందర్భంగా ఐకేపీ ఎంపీఎం లక్ష్మీనర్సమ్మ మాట్లాడుతూ.. జెత్రంతండాలో మదర్ బర్డ్ యూనిట్‌లో నాటుకోడి పిల్లలను ఆరు వారాల పాటు పెంచి గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యుల సబ్ యూనిట్‌లకు అందిస్తున్నట్లు తెలిపారు. కోళ్లను పెంచి ఉపాధి పొందడానికి మహిళా శక్తి పేరుతో రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

◆ **విద్యార్థులకు బ్యాగులు అందజేత**

పాపన్నపేట(మెదక్): కొటివిటి ప్రైవేట్ కంపెనీ, యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని చీకోడ్-లింగాయిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, ఆట సామగ్రిని పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు రజినీకాంత్, మిలాన్, సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.